సాక్షి
బాపట్ల
శనివారం, 5, ఏప్రిల్, 2025



రిఫ్రిజిరేటర్ బహూకరణ
పిడుగురాళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్‌కు రిఫ్రిజిరేటర్‌ను తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల తరఫున శుక్రవారం అందించారు. డీఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.



వైభవంగా మహా కుంభాభిషేకం
పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని తెలగ పాలెంలో ఉన్న కోదండ రామాలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ బండారు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్)గా డాక్టర్ బండారు వెంకట రంగారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన డాక్టర్ బండారు కర్నూలు మెడికల్ కాలేజీలో 1982లో ఎంబీబీఎస్ చదివారు. 1992లో పీడాటిక్స్‌లో పీజీ వైద్య పూర్తి చేశారు. మెదక్ జిల్లా ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. 2009లో డెప్యూటీ సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి పొంది ప్రకాశం జిల్లా కంభంకు బదిలీ అయ్యారు. 2019లో సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ పొంది మాచర్లకు బదిలీ అయ్యారు. 2014లో బాపట్ల ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేశారు. 2022 నుంచి పల్నాడు డీసీహెచ్ఎస్‌గా నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. గుంటూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రంగారావును వైద్యులు, కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

బోయపాలెం డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్తిపాడు మండలం బోయపాలెం జిల్లా వృత్తి విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్, లెక్చరర్ పోస్టుల్లో డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎంఈఓలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించి, ఈనెల 16,17వ తేదీల్లో పరీక్షలు, ఈనెల 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డైట్‌బోయపాలెం.కామ్ సందర్శించాలని, సందేహాల నివృత్తికి 94408 46046 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా చేయాలని, దరఖాస్తుల స్వీకరణకు గుంటూరు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో మీకోసం మేము



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో 7వ వారం మీకోసం మేము పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ పేషెంట్‌లకు హాస్పిటల్ నియమావళి గురించి సూచనలు చేశారు. ల్యాబ్ పరీక్షలు, మరేదైనా ఎవరైనా ఎటువంటి ప్రలోభాలకు మోసపోవద్దని తెలిపారు. ఎలాంటి సమస్యనైనా ఎవరికీ డబ్బు చెల్లించవద్దని, ఒకవేళ ఎవరైనా డబ్బు అడిగితే రశీదు అడగాలని, ఇవ్వని పక్షంలో సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఓంకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ కొని మహిళ మృతి



అద్దంకి రూరల్: గేదెలు కాసుకుని ఇంటికి వెళుతున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొట్టటంతో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. సంఘటనకు చేరుకుని సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా జరిగిన తీరును పరిశీలించారు. ద్విచక్రవాహనదారుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాలు..మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన కొటికలపూడి గ్రామానికి చెందిన మూరబోయిన కోటేశ్వరమ్మ (54)గేదెలు కాసుకుని సాయంత్రం ఇంటికి వస్తుండగా వేణుగోపాలపురం రోడ్డు వద్దకు రాగానే రజానగరం గ్రామానికి చెందిన మురళీకృష్ణ ద్విచక్రవాహనంపై అద్దంకి నుంచి రజానగరం వెళుతూ కోటేశ్వరమ్మను ఢీకొట్టాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరువురిని 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలైన కోటేశ్వరమ్మ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మురళీకృష్ణ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాబేళ్ల స్వర్గం..సముద్ర తీరం

- తాబేళ్ల సంరక్షణకు 12 మంది వలంటీర్లు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 145 తల్లి తాబేళ్ల నుంచి 16,170 గుడ్లు సేకరణ
- సురక్షితంగా 2,358 ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలు సముద్రంలోకి విడుదల

బాపట్ల జిల్లాలోని తీరప్రాంతాల్లో ఆరు సంరక్షణ కేంద్రాలు



తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదులుతున్న అటవీ అధికారులు

వేటపాలెం: బాపట్ల జిల్లాలో సముద్రపు తాబేళ్ల (ఆలీవ్ రిడ్లే) సంరక్షణలో అటవీ శాఖ ముందుంది. జిల్లాలో చిన్నగంజాం మండలం ఏటిమొగ్గ నుంచి బాపట్ల మండలం సూర్యలంక వరకు 55 కిలో మీటర్ల సముద్ర తీరం వెంట సముద్ర తాబేళ్ల సంరక్షణకు అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా తీర ప్రాంత గ్రామాల్లో ఆరు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో తాబేళ్ల గుడ్లను సేకరించి పిల్లలుగా తయారైన తరువాత వాటిని సముద్రంలోకి విడిచి పెడుతుంటారు. వీటి సంరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా తీర ప్రాంతాల్లో 12 మంది వలంటీర్లను అటవీ శాఖ ఏర్పాటు చేసింది. వీటిపై పర్యవేక్షణకు కోఆర్డినేటర్‌ను నియమించారు.

తాబేళ్ల సంరక్షణ ఇలా...

ఆలీవ్ రిడ్లే తాబేళ్ల ప్రతి ఏడాదీ జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలలు మాత్రమే ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడుతుంటాయి. సముద్రం నుంచి అర్ధరాత్రి వేళల్లో తాబేళ్లు ఒడ్డుకు చేరుకొని తీరానికి దగ్గరలో ఇసుకలో గుంటలు ఏర్పాటుకొని గుడ్లు పెడుతుంటాయి. ఒక్కొక్క తల్లి తాబేలు 100 నుంచి 160 గుడ్ల వరకు పెడుతుంటుంది. వేకువ జామునే అటవీ శాఖ ఏర్పాటుచేసిన వలంటీర్లు తీరం వెంట వెళ్లి తల్లి తాబేళ్ల కాళ్ల అనవాళ్లను గుర్తించి అవి ఎక్కడ గుడ్లు పెట్టింది కనుగొంటారు. తల్లి తాబేళ్లు పెట్టిన గుంటను జాగ్రత్తగా తవ్వి గుడ్లను సేకరించుకొని వెళ్లి సంరక్షణ కేంద్రంలో గుంటలు ఏర్పాటు చేసి అక్కడ పెడతారు. సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన గుంతల్లో నుంచి గుడ్లు పిల్లగా మార్పు కావడానికి 33 డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే ఉండాలి. ఉష్ణోగ్రత 33 డిగ్రీలు దాటకుండా చూసే బాధ్యత వలంటీర్లపై ఉంటుంది. ఆ గుడ్లు 48 నుంచి 55 రోజుల్లో పిల్లలుగా మార్పు చెందుతాయి. ఈ పిల్లలను తిరిగి వలంటీర్ల ద్వారా సురక్షితంగా సముద్రంలో వదిలిపెడతారు.

సంరక్షణ కేంద్రాలున్న ప్రాంతాలు..

జిల్లాలోని సముద్ర తీర గ్రామాలైన చిన్నగంజాం మండలం పరిధిలో ఏటిమొగ్గ, కుంకుడు చెట్టపాలెం, వేటపాలెం మండల పరిధిలో రామచంద్రాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం, రామాపురం, బాపట్ల మండల పరిధిలోని సూర్యలంక తీరాల వద్ద ఒక్కొక్క సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్న సముద్ర తీరంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 145 తల్లి తాబేళ్లు తీరానికి వచ్చి 16,170 గుడ్లు పెట్టి వెళ్లాయి. వీటిని వలంటీర్లు సేకరించి ఆరు సంరక్షణ కేంద్రాల్లో ఉంచారు. ప్రస్తుతం ఈ గుడ్లు ఇప్పటి వరకు 2358 తాబేళ్ల పిల్లలుగా మారడంతో వాటిని సముద్రంలోకి సురక్షితంగా వదిలేశారు. ఈ ప్రక్రియ మే నెల వరకు కొనసాగుతుంటుంది.



సంరక్షణ కేంద్రంలో గుంటలో గుడ్లు సంరక్షిస్తున్న వలంటీరు

ఇప్పటి వరకు తల్లి తాబేళ్లు పెట్టిన గుడ్లు, సముద్రంలోకి వదిలిన పిల్లలు వివరాలు...

సంరక్షణ కేంద్రం	తల్లి తాబేళ్లు	పెట్టిన గుడ్లు	వదిలిన పిల్లలు
ఏటిమొగ్గ	36	4063	764
కుంకుడుచెట్లపాలెం	16	1687	611
రామచంద్రాపురం	26	2944	339
పొట్టి సుబ్బయ్యపాలెం	26	2896	227
రామాపురం	17	1929	211
సూర్యలంక	24	2651	206

తొమ్మిదేళ్లుగా సంరక్షణ కేంద్రాలు



అటవీ శాఖ ఆధ్వర్యంలో 2016 సంవత్సరం నుంచి సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంరక్షణకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. వారికి అటవీ శాఖ ద్వారా గౌరవ వేతనం ఇస్తారు. వలంటీర్లు, మత్స్యశాఖ గ్రామాల పొరులనే ఎంపిక చేస్తారు. ఇటీవల వేటపాలెంలో తాబేళ్ల సంరక్షణ కోసం అటవీ శాఖ కార్యాలయం ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయంలో సంరక్షణ కేంద్రాల వలంటీర్లకు శిక్షణ ఇస్తుంటారు.

– ఎస్ చంద్రారెడ్డి, జిల్లా సమన్వయకర్త, వేటపాలెం.

వేల సంఖ్యలో సంరక్షించాం

తాబేళ్ల సంరక్షణ కేంద్రాల వద్ద తొమ్మిదేళ్లుగా వలంటీర్‌గా పనిచేస్తున్నాను. వేల సంఖ్యలో తాబేళ్ల పిల్లలను సంరక్షించి సముద్రంలోకి వదిలి పెట్టాం. వేకువజామునే సముద్రం ఒడ్డునే తల్లి తాబేళ్లు పెట్టిన గుడ్లు సేకరించడానికి వెళతాం. వాటి కాలి అడుగు జాడలను బట్టి అవి గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తాం.

– కే అర్జునరావు, వలంటీర్

ఇంకొల్లులో భారీ దొంగతనం

- రూ.55 లక్షల నగదు, 24 సవర్ల బంగారం దోపిడీ
- రంగంలోకి దిగిన క్లూస్ టీం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



ఇంకొల్లు (చినగంజాం): బాపట్ల జిల్లా ఇంకొల్లులో భారీ దొంగతనం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువాలో దాచి ఉంచిన రూ.55.50 లక్షల నగదు, రూ.20 లక్షల విలువైన బంగారు నగలు అపహరించుకుని తీసుకెళ్లారు. ఎస్ఐ జీ సురేష్ అందించిన సమాచారం ప్రకారం... ఇంకొల్లు గ్రామంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఇంటిలో జాగర్లమూడి శివప్రసాద్ నివాసం ఉంటున్నారు. ఆయన రెండో అంతస్తులో నిద్రిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడో అంతస్తులోకి ప్రవేశించి గది తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.55.50 లక్షల నగదు, 24 సవర్ల బంగారు వస్తువులను అపహరించి తీసుకెళ్లారు. ఉదయం నిద్ర లేచిన ఆయన దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జీ సురేష్‌లు క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. తాను డైరెక్టర్‌గా ఉన్న ఎంఆర్ఆర్ ప్రకాశం హైస్కూల్ విద్యార్థుల ఫీజులు రూ.20 లక్షలు, పంట అమ్మిన డబ్బు రూ.30 లక్షలు, వ్యాపారం ద్వారా తన సోదరులు సంపాదించిన రూ.5.50 లక్షల నగదుతోపాటు రూ.20 లక్షల విలువైన బంగారు నగలు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీలను మోసగించిన చంద్రబాబు

- వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



కొల్లూరు: మైనార్టీలను సీఎం చంద్రబాబు తీవ్రంగా మోసం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మైనార్టీలకు అండగా ఉంటామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న చంద్రబాబునాయుడు పార్లమెంట్‌లో మైనార్టీలకు వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ బోర్డు బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మైనార్టీలను అణగదొక్కే రీతిలో చట్టాలను చేసుకుంటూ పోతుంటే, వాటికి టీడీపీ మద్దతునిస్తుందన్నారు. చంద్రబాబు రెండు నాలుకల విధానాన్ని అర్థం చేసుకోలేక మైనార్టీలు గత ఎన్నికల్లో మద్దతు నిచ్చి మోసపోయారన్నారు. ముస్లిం సమాజాన్ని వేధించి వారి పూర్వీకులు అల్లా పేరుతో దానం చేసిన భూములు లాక్కొని కార్పొరేట్ మిత్రులకు అప్పగించే విధంగా చంద్రబాబు సర్కారు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ చట్టం అమలు వలన ముస్లిం సమాజానికి తీవ్రమైన నష్టం వాటిల్లనుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ తొలి నుంచి మైనార్టీలకు అండగా ఉంటూ, వక్ఫ్ బోర్డు బిల్లును ఎట్టి పరిస్థితుల్లో సమర్థించబోమని చెప్పిన విషయాన్ని ముస్లిలు గుర్తుంచుకోవాలని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇచ్చిన మాట నిలపెట్టుకునే అలవాటు ఎన్నడూ లేదని అశోక్‌బాబు విమర్శించారు. చంద్రబాబు ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో టీడీపీకి, కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్ల: జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులకు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నాటు సారా నిర్మూలన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించాలన్నారు. నాటుసారా నిర్మూలనకు గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. ముందుగా గ్రామాలలో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నాటు సారా తయారు చేయడంలో మార్పులు రానట్లయితే గ్రామాలలో తయారీ దారులపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పోలీస్, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ అధికారులు సమన్వయముతో పనిచేసి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. నాటు సారా తయారీదారులు మానుకున్నట్లయితే వారి జీవనోపాధి మెరుగుపరచడానికి గిరిజన సంక్షేమశాఖ ద్వారా బ్యాంకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లాఅటవీ శాఖ అధికారి భీమా నాయక్, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు: విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిన ఇరువురు లైన్‌మెన్ల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయం కింద నగదు అందజేసినట్లు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని ఈపూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా జరగడంతో దోనేపూడి లైన్‌మన్ పోతార్లంక లీలాదుర్గాశంకర్ (51), ఈపూరు సచివాలయం జూనియర్ లైన్‌మన్ ఆకుల మహేష్ (37)లు మృతి చెందారు. ప్రమాద ఘటనపై కొల్లూరు తహసీల్దార్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో మృతుల కుటుంబాలను పరామర్శించిన తహసీల్దార్ ఒక్కొక్క మృతుడి కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చుల కింద రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

బాపట్లలో పచ్చనేతల దుశ్చర్య

- కోర్టు వివాదంలో ఉండగా సైకిల్ స్టాండ్ తొలగింపు
- సీఐతోపాటు పలువురిపై డీఎస్పీకి ఫిర్యాదు
- మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళతామన్న బాధితుడు



జేసీబీతో సైకిల్‌స్టాండ్ తొలగిస్తున్న పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది



స్టాండ్ నిర్వాహకుడు వెంకట్రావును బలవంతంగా తీసుకెళుతున్న పోలీసులు

బాపట్ల : రోడ్డు విస్తరణకు సహకరించాడు...నిబంధనల ప్రకారం టెండర్లలో సైకిల్ స్టాండ్‌ను దక్కించుకున్నాడు. ఏరియా వైద్యశాలలో ఏమాత్రం ఉపయోగంలేని స్థలానికి ప్రతి నెలా క్రమం తప్పకుండా రూ.32 వేలు అద్దె చెల్లిస్తున్నాడు..అయినా కూటమి సర్కారు అతనిపై కక్ష కట్టింది. సైకిల్ స్టాండ్ నిర్వాహకుడు వైఎస్సార్ సీపీ నాయకుడు కావడమే అందుకు కారణం. అతని సైకిల్ స్టాండ్ తొలగించాలంటూ పలు విధాలుగా కూటమి నేతలు ప్రయత్నించారు. కోర్టులో వివాదం ఉన్నప్పటికీ ఎటువంటి ఆదేశాలు రాకముందే టీడీపీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని సూపరింటెండెంట్‌ను ముందుపెట్టి మరీ సైకిల్ స్టాండ్‌ను శుక్రవారం తొలగించారు. టీడీపీ నాయకుల హడావుడితో రైల్వేస్టేషన్ వద్ద గందరగోళం నెలకొంది.

బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఏరియా వైద్యశాల ఆవరణలో శ్రీనివాస సైకిల్ స్టాండ్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు నర్రావుల వెంకట్రావు పదేళ్ల కిందట టెండర్‌లో సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి నిబంధనల ప్రకారం అద్దె చెల్లిసూ వస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఆ పార్టీ నేతల కన్ను సైకిల్ స్టాండ్‌పై పడింది. స్టాండ్‌ను తొలగించాల్సిందిగా సూపరింటెండెంట్ మౌఖిక ఆదేశాలు ఇవ్వగా వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించాడు. స్టాండ్ ఉన్నచోట అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటూ కోర్టుకు తప్పుడు పత్రాలను సమర్పించారు. ఈమేరకు కోర్టులో వివాదం కొనసాగుతుంది. అయితే సూపరింటెండెంట్ సిద్దార్థ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా టీడీపీ నాయకులతోపాటు పోలీసులను, జేసీబీని తీసుకువచ్చి స్టాండ్ తొలగింపునకు పూనుకున్నారు. అక్కడ ఏమి జరుగుతుందో కొద్దిసేపటి వరకు అర్థం కాకపోయిన వెంకట్రావు తనకు అన్యాయం చేయొద్దంటూ ప్రాథేయపడ్డాడు. వెంటనే అక్కడే ఉన్న టీడీపీ నాయకులు, వెంకట్రావును పక్కన ఉన్న చల్లా రామయ్య అనే వ్యక్తిని లాగి పక్కనపడేశారు. టీడీపీ నాయకులు వెంకట్రావుపై దాడి చేస్తునప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. స్టాండ్ తొలగించేందుకు తనకు నోటీసు ఇవ్వాలని, అక్కడ ఉన్న వాహనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని సూపరింటెండెంట్‌కు ఎన్నిసార్లు చెప్పినా వినకుండా తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో అక్కడ ఎవరైనా ప్రశ్నిస్తే టౌన్ సీఐ రాంబాబు వారిని వాదించి పక్కకు పంపివేశారు.

తన స్టాండ్ తొలగింపును అక్రమంగా చేపట్టారంటూ సూపరింటెండెంట్ సిద్దార్థ, సీఐ రాంబాబు, టీడీపీ నాయకుడు గవిని శ్రీనివాసరావులపై డీఎస్పీ రామాంజనేయులకు బాధితుడు వెంకట్రావు ఫిర్యాదు చేశారు. కోర్టులో వివాదం ఉన్నప్పుడు నిబంధనకు విరుద్ధంగా స్టాండ్ తొలగించటం, అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతోపాటు తనకు జరిగిన అన్యాయంపై మానవహక్కుల కమిషన్ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

డీఎస్పీకి ఫిర్యాదు చేసిన వెంకట్రావు

తీసుకువచ్చిన గంజాయిని పొడి చేసి పొట్లాలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. న్యూగుంటూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాలనీ, మణిపురం ఓవర్‌బ్రిడ్జీ కింద, పాతగుంటూరు సుద్దపల్లి డొంక, నందివెలుగు రోడ్డులోని ఉన్న ఒక ఖాళీ వెంచర్, గుజ్జగుండ్ల సెంటర్ సమీపం, శారదాకాలనీ, కృష్ణబాబుకాలనీ, ఐపీడీకాలనీ, సంపత్‌నగర్‌లోని కొబ్బరితోట ప్రాంతం, కేవీపీ కాలనీలో పాటు పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు అధికంగా జరుగుతున్నట్టు సమాచారం. లిక్విడ్, సిగరెట్ల రూపంలోనూ గంజాయిని విక్రయిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు లైన్‌మెన్ల మృతి

- మరో నలుగురు ఉద్యోగులకు గాయాలు
- బాపట్ల జిల్లా ఈపూరులంకలో ఘటన



మృతి చెందిన పోతార్లంక లీలాదుర్గా శంకర్

పోతార్లంక లీలాదుర్గా శంకర్ (ఫైల్) →



మృతి చెందిన ఆకుల మహేష్

ఆకుల మహేష్ (ఫైల్) →

కొల్లూరు: విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బందికి షాక్ కొట్టి ఇద్దరు లైన్‌మెన్ మృతిచెందారు. మరో నలుగురు ఉద్యోగులు గాయపడ్డారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈపూరులంక సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యే 32 కేవీ లైన్‌పై తాటిచెట్టు పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొల్లూరు విద్యుత్ శాఖ ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఉదయం కరెంటు సరఫరాను నిలుపుదల చేయించి ఆరుగురు సిబ్బందితో కలిసి లైన్‌లకు మరమ్మతు పనులు చేపట్టారు. వారు మరమ్మతులు చేస్తుండగానే ఆకస్మికంగా ఒక లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆరుగురు ఉద్యోగులు విద్యుదాఘాతానికి గురయ్యారు. దోనేపూడి గ్రామ లైన్‌మన్ పోతార్లంక లీలాదుర్గా శంకర్ (51), ఈపూరు సచివాలయం జూనియర్ లైన్‌మన్ ఆకుల మహేష్ (37) విద్యుత్ షాక్‌తో స్తంభం పై నుంచి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకువెళ్లే సమయానికి మృతిచెందాడు. మహేష్‌ను కొల్లూరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మరణించాడు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు మునిపల్లి శ్రీను, రామకృష్ణ, మల్లిఖార్జున, నాగేశ్వరరావు కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యారు.

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో శుక్రవారం 635 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 464 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.10,225, గరిష్ఠ ధర రూ.13,150, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వివరించారు. కాయలు 171 బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.10,225, గరిష్ఠ ధర రూ.12,850, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వెల్లడించారు. మొత్తం 476.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

1,23,485 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,13,955 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,23,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,777 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

సీఆర్డీఏ సిటిజన్ అడ్వైజరీ కమిటీలో రైతులకు చోటేదీ?

తాడికొండ: ఏపీ సీఆర్డీఏ గురువారం ప్రకటించిన సిటిజన్ అడ్వైజరీ కమిటీలో రాజధాని అమరావతి కోసం పోరాడిన వారిని మరవడం బాధాకరమని దళిత జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య విమర్శించారు. గురువారం తుళ్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ కోర్టులు, స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న మహిళామణులకు ఈ అడ్వైజరీ కమిటీలో చోటు దక్కలేదని ఆరోపించారు. కమిటీలో ధనవంతులకే చోటు దక్కిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఓటు లేని వ్యక్తులూ కమిటీలో ఉండటంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ పునఃపరిశీలించి రైతులకు కమిటీలో చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో

చీరాల క్రీడాకారుల ప్రతిభ

- బంగారు, కాంస్య, రజత పతకాలు కైవసం
- జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన బంగారు పతకదారులు




పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌ను అభినందిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పవన్‌కుమార్

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో చీరాల క్రీడాకారులు విశేష ప్రతిభచూపించారు. తమ ప్రత్యర్థులను పదునైన పంచ్‌లతో బెంబేలెత్తించి అనేక పతకాలను కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 2 నుండి 3వ తేది వరకు గుంటూరు తెనాలిలో 5వ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ క్యాడిట్ మరియు సబ్ జూనియర్, సీనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చీరాలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు కోచ్ మల్లెల సురేష్ ఆధ్వర్యంలో పోటీలలో పాల్గొన్నారు. ఎంతో ప్రతిభ చూపిన మన క్రీడాకారులు బంగారు, కాంస్య, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. పతకాలు కైవసం చేసుకున్నవారిలో మినీ సబ్‌జూనియర్స్ విభాగంలో ఎం.లియో క్రిష్ 21 కేజిల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. 35 కిలోల సబ్‌జూనియర్ విభాగంలోఎం.దివ్యసాన్వి రజత పతకం, క్యాడిట్ వెయిట్ 21 కిలోలు విభాగంలో ఆర్.ఆకాశరెడ్డి బంగారు పతకం, 35 కేజిల విభాగంలో ఎస్‌కె.వైభవ్ రజత పతకం, జూనియర్స్ విభాగంలో ఐ.రాహుల్ 51 కిలోల విభాగంలో రజతం, ఎం.మ్యాక్సిమస్ 55 కేజిల విభాగంలో రజత పతకం సాధించాడు. సీనియర్స్ విభాగంలో జి.భాస్కర్ 51 కేజిల విభాగంలో బంగారు పతకం సాధించాడు. 60 కేజిల విభాగంలో షేక్ బాజి బంగారు పతకం సాధించాడు. 65 కేజిల విభాగంలో ఎం.మహేష్‌బాబు బంగారు పతకం సాధించాడు. ఎస్‌కె.సుభాని 54 కేజిల విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ పోటీలలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు మహారాష్ట్ర నాసిక్‌లో జరిగే సీనియర్ నేషనల్ తైక్వాండో పోటీలలో పాల్గొంటారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరి మల్లెల సురేష్ తెలిపారు. పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్ సురేష్‌లు శుక్రవారం ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్ ట్రాఫిక్ ఎస్సై ఎం.పవన్‌కుమార్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. క్రీడాకారులను కోచ్‌ను ఎస్సై సత్కరించారు. జాతీయ స్థాయి పోటీలలో రాణించి చీరాలకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను క్రీడాభిమానులు క్రీడా ప్రేమికులు అభినందనలు తెలియజేశారు.

పచ్చిరొట్ట విత్తన ధరలు ఖరారు

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 9,536 క్వింటాళ్ల కేటాయింపు
- 50 శాతం రాయితీతో రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు



జీలుగ విత్తనాలు(ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): పచ్చిరొట్ట విత్తన ధరలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖరీఫ్‌లో రాయితీ విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా ఏటా రైతులకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న విషయం తెలిసిందే. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రీయ పదార్థం బాగా పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీంతో ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరిగింది. ఫలితంగా ప్రభుత్వం రాయితీపై వీటిని అందిస్తోంది. తాజాగా రాయితీ ధరలను ఖరారు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా(గుంటూరు, పల్నాడు, బాపట్ల)కు ఈ ఏడాది 9,536 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేటాయించారు. అందులో గుంటూరు జిల్లాకు 301 క్వింటాళ్ల జీలుగ, 436 క్వింటాళ్లు జనుము, 967 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 1,704 క్వింటాళ్లు కేటాయించారు. పల్నాడు జిల్లాకు 2,607 క్వింటాళ్లు జీలుగ, 1,559 క్వింటాళ్లు జనుము, 1,178 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 5,544 క్వింటాళ్లు కేటాయించారు. అలాగే బాపట్ల జిల్లాకు 856 క్వింటాళ్లు జీలుగ, 853 క్వింటాళ్లు జనుము, 779 క్వింటాళ్లు పిల్లిపెసర కలిపి మొత్తం 2,488 క్వింటాళ్లు కేటాయించారు. వీటిని 50 శాతం రాయితీతో రైతులకు ఇవ్వనున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా వీటిని సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు.

గరిష్ఠంగా ఐదు బ్యాగులు

జీలుగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటా జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.5,450 చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.18 వేలు కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.9 వేలు చొప్పున రైతులకు విక్రయిస్తారు. జీలుగ, జనుము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ల రూపంలో, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ కింద ఎకరాలోపు రైతులకు ఒక బ్యాగ్, రెండు ఎకరాలకు రెండు బ్యాగులు, మూడు ఎకరాలకు మూడు బ్యాగ్‌లు, నాలుగు ఎకరాలున్న రైతులకు నాలుగు బ్యాగ్‌లు, ఐదు ఎకరాలు, అంత కన్నా ఎక్కువ ఉన్న వారికి గరిష్ఠంగా ఐదు బ్యాగుల పంపిణీ చేయనున్నారు. రైతు ఆసక్తిని బట్టి మూడు రకాల విత్తనాలు వేర్వేరుగానూ, మూడు రకాల విత్తనాలు కలిపి ఒకే బ్యాగ్ రూపంలోనూ ఇవ్వనున్నారు. మూడు కలిపిన వాటిలో నాలుగు కిలోల చొప్పున జీలుగ, జనుము, రెండు కిలోల పిల్లిపెసర ఉంటాయి. 10 కిలోలు కలిగిన మిక్సింగ్ కిట్ పూర్తి ధర రూ.1,296 కాగా, 50 శాతం రాయితీ పోనూ రూ.648లు చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)లో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ సీడ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా మేనేజర్ పి.సుమలత శుక్రవారం 'సాక్షి'కి వివరించారు.

చికెన్ వల్ల ఎవరికీ బర్డ్‌ఫ్లూ సోకలేదు

నెక్ అడ్వైజర్ డాక్టర్ కరణం బాలస్వామి



నరసరావుపేట: రాష్ట్రంలో కోళ్ల వల్ల బర్డ్‌ఫ్లూ సోకి మనుషులు మృతి చెందిన సంఘటనలు లేవని నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (నెక్) అడ్వైజర్ డాక్టర్ కరణం బాలస్వామి పేర్కొన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ చికెన్, గుడ్లు తిని దేశాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన చిన్నారి ఆరాధ్య ఉదంతంపై కేంద్ర బృందం శుక్రవారం ఇక్కడకు వచ్చిన సమయంలో బాలస్వామి కూడా వచ్చారు. జరిగిన విషయం తల్లిదండ్రులు, స్థానిక వైద్యులు, పశుసంవర్ధకశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత 25 ఏళ్ల నుంచి బర్డ్‌ఫ్లూ కోళ్లకు వస్తున్నా మనుషులకు సంక్రమించిన దాఖలాలు లేవని అన్నారు. ఆరాధ్య మృతికి సంబంధించి పౌల్ట్రీ రంగంపై నిందలు వేయటం తగదన్నారు. బర్డ్‌ఫ్లూతో రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోళ్లు మృతి చెందినా, మనుషులకు ఈ వ్యాధి ఇప్పటివరకు సోకలేదని చెప్పారు. ఇటీవలనే తణుకులో రెండు లక్షల కోళ్లు, తెలంగాణలోని చౌటుప్పల్‌లో భారీగా కోళ్లు చనిపోయాయని గుర్తుచేశారు. వాటిని తొలగించి ఖననం చేసే కూలీలకు కూడా ఈ వ్యాధి సోకలేదని అన్నారు. చికెన్ తింటున్న వారికి సంక్రమించలేదని అన్నారు.

క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా



మాట్లాడుతున్న ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న రేపల్లె క్రైస్తవ సంఘాల నాయకులు

రేపల్లె రూరల్: క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. అనుమానాస్పద స్థితిలో ఇటీవల మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రేపల్లె క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవుని వాక్యాన్ని ప్రజలకు చేర్చి పరిశుద్ధులను చేసే పాస్టర్‌లపై దాడులకు పాల్పడటం అమానుషమని పేర్కొన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు చిత్రాల ఓబేదు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అన్నికోణాలలో సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పాస్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ కుటుంబ సభ్యులకు క్రైస్తవ సంఘాలు అన్ని వేళలా అండగా నిలుస్తాయని అన్నారు. ర్యాలీ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటరుల మీదగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లలో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు, సముద్రాల ప్రభుకిరణ్, షేక్ ఖుద్దూష్, ఆలా రాజ్‌పాల్, జాలాది మునియ్య, జాలాది సునీల్, వివిధ చర్చిల పాస్టర్‌లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి



అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను పరామర్శిస్తున్న రమణారెడ్డి

చీరాల టౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేని ప్రభుత్వం ఓ వైపు.....అకాల వర్షంతో అన్నదాతలు పండించిన పంట తడిచి రైతులను నట్టేట ముంచిందని ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈపురుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రబీ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమన్నారు. ప్రభుత్వం ధర రూ.1750 ఉండగా రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు, దళారులు బస్తాను రూ.1350కి కొనుగోలు చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రబీ ధాన్యాన్ని మార్చిలోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోగా అధికారంలోకి వచ్చిన టీడీపీ, కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, మరోవైపు ప్రభుత్వం పట్టించుకోకపోవడం మళ్లీ అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోవడంతో అన్నదాత తీవ్రంగా నష్టపోయాడని అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబు బస్తాకు రూ.1750 ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే పార్టీ తరపున పోరాడి అండగా నిలబడతామన్నారు. రైతులను పరామర్శించిన వారిలో పలువురు నాయకులు ఉన్నారు.

ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించాలి



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి రూరల్: ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ప్రజలు నుంచి వచ్చి విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. పట్టణంలోని రోడ్లు డ్రైనేజిలకు సంబంధించినవి, దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు, విద్యుత్ సమస్యలపై ప్రజలు నుంచి ఎక్కువగా విజ్ఞప్తులు అందాయి. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, విద్యుత్‌శాఖ డీఈ మస్తాన్‌రావు, ఎంపీడీవో సింగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

309 మంది విద్యార్థినులకు సైకిళ్ల అందజేత..

అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 309 మంది ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు నూతన సైకిళ్లు అందజేశారు. నియోజకవర్గంలోని మిగతా పాఠశాలలలోని విద్యార్థినులకు సైకిళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించాలి

గుంటూరు జిల్లా జేసీ భార్గవ్‌తేజ



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా జేసీ

గుంటూరువెస్ట్: దివ్యాంగుల సమస్యలపై అధికారులు దృష్టి సారించి వారి ఇబ్బందులను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వికలాంగుల కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. వివిధ దివ్యాంగ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్సులు, మున్సిపల్ కాంప్లెక్సుల్లో దుకాణాలు, స్టాల్స్ కేటాయింపులో దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వంద శాతం వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా బస్సు పాస్ ఇవ్వాలన్నారు. దివ్యాంగుల ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తే వారి కుటుంబాలు బాగుంటాయని పేర్కొన్నారు. అవసరం మేరకు ట్రైసైకిళ్లు మంజూరు చేయాలని కోరారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంలో గ్యారంటీగా ప్రభుత్వ ఉద్యోగి సూరిటీ అడుగుతున్నారని, దీన్ని కొంత ఆలోచించాలని పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



గణపవరం సబ్ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

రాజుపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎస్ఈ మాట్లాడుతూ.. బిల్లుల వసూలులో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లోడ్ బ్యాలెన్సు చేసుకోవాలని సూచించారు. 50 శాతం అదనపు లోడు సబ్సిడీ స్కీమును గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని వెంటనే బిల్లులు చెల్లించాలని తెలిపారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, బాధ్యులైన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా మండలంలోని రాజుపాలెం, గణపవరం, అనుపాలెం సబ్ స్టేషన్‌లలో తనిఖీలు చేశారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈఈ బి.నాగసురేష్‌బాబు, మాచర్ల ఈఈ ఎస్. సింగయ్య, ఏఈఈ కోట పెదమస్తాన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీఆర్ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సు శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ సదస్సును వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవా ధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డే బాజీబాబు, షేక్ నాగులమీరా శుక్రవారం పిలుపునిచ్చారు. వీఆర్ఏలకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాల పెంపుదల లేక కేవలం రూ.10,500తో మాత్రమే సర్కారు వెట్టి చాకిరీ చేయిస్తోందని ఆవేదన చెందారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య



సంఘటనా స్థలంలో మృతదేహం

నరసరావుపేటటౌన్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి సంఘటన శుక్రవారం సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ కింద పడి పెద్దచెరువు ప్రాంతానికి చెందిన గాలి థామస్(70) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పైలెట్ సమాచారాన్ని నరసరావుపేట రైల్వే పోలీసులకు అందించారు. ఎస్ఐ శ్రీనివాసనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మరో ఏడుగురికి తీవ్రగాయాలు



జోజమ్మ మృతదేహం

వినుకొండ: మిరపకాయల కూలీల ఆటో తిరబడి ఒకరు మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఏనుగుపాలెం సమీపంలో జరిగింది. ఉమ్మడివరం నుంచి నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామానికి మిర్చి కోసేందుకు ప్రతిరోజు కూలీలు వెళ్తా ఉంటారు. ఉదయం ఏనుగుపాలెం సమీపంలో ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో జోజమ్మ (60) మృతి చెందింది. మార్తమ్మ, వెంకాయమ్మ, అంకమ్మ, కోటమ్మ, మరియమ్మ, ఆదెమ్మ తదితర ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో వారిని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం ఆనందపేటలో గురువారం జరిగిన వృద్ధురాలి హత్య కేసులో పాతగుంటూరు పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3న ఉదయం ఆనందపేటలో వృద్ధురాలు పఠాన్ ఖాజాబీని షేక్ ఫైరోజ్, ఫయాజ్, ఆసీఫ్, సన్ని అనే నలుగురు కొట్టి చంపారు. దీంతోపాటు ఖాజాబీ కుమార్తె షాజహాన్, అల్లుడు హసన్, వీరి కుమారుడు హర్షద్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. దీంతో పోలీసులు ఫైరోజ్, ఫయాజ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులు ఆసీఫ్, సన్నీలు పరారీలో ఉన్నట్లు సమాచారం. పక్కా పథకం ప్రకారమే దాడికి తెగబడినట్లు నిందితులు అంగీకరించారని తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు బృందంగా ఏర్పడి రంగంలో దిగారు.